

APTEL/2009/29308

# స్నేహిత ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

06-04-2026
సోమవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 163
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com

# న్యాయం కోసం మహా ప్రాంగణం




## తెలంగాణకు చారిత్రాత్మక రోజు

న్యాయవ్యవస్థకు అత్యున్నత గౌరవం

హైకోర్టు జోన్2కు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది

ఆధునిక సదుపాయాలతో అతిపెద్ద కోర్టు నిర్మాణం

డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయడమే లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

జాతీయ స్థాయిలో పోలీసులకు క్రీడా పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గచ్చి బౌలి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపి యన్‌షిప్-2026 ముగింపు వేడుకల్లో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 34 పోలీసు విభాగాలు ఇందులో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. ఈ టోర్నీకి బీఎన్ మల్లిక్ పేరు పెట్టడం చాలా గొప్ప నిర్ణయమని కొనియాడారు. పోలీసు గుఢాచారిగా బీఎన్ మల్లిక్ దేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.



2



2

## పొంగులేటి భూ దందా

- నాదర్‌గుల్‌లో రూ.7వేల కోట్ల భూ కబ్జాకు యత్నం
- 373 ఎకరాల భారీ భూ కుంభకోణానికి స్కెచ్
- న్యాయస్థానం తీర్పును పట్టించుకోని కబ్జాదారులు
- కుంభకోణం వెనుక మంత్రి పొంగులేటి కుటుంబ సభ్యులు
- భూ కబ్జాదారుల సంస్థల్లో వ్యాపార భాగస్వాములుగా పొంగులేటి కుటుంబీకులు
- పేద రైతులపై గుండాల దాడులు.. బెదిరింపులు
- మాజీమంత్రి హరీష్‌రావు సంచలన ఆరోపణలు

## పార్టీ మారే ప్రసక్తే లేదు

- బీఆర్‌ఎస్‌లోకి వెళ్తున్నాడన్న ప్రచారం అబద్ధం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



2

## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో కలపండి



2



## కేరళంలో భూభారతి అమలు చేస్తాం

- తెలంగాణలో ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా చేస్తున్నాం
- కేరళంలోకూడా యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తాం
- పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచింది
- కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కేరళంలో యూడిఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల మాదిరిగానే ప్రజలకు ఇచ్చే ప్రతి హామీని కచ్చితంగా అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మావేలిక్కర

మిగతా2లో...



## ప్రైవేట్ కంటే అద్భుత సేవలు

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

2

## సింగరేణిని కాపాడుకునేందుకు..

# మరో ఉద్యమానికి సిద్ధం

### ప్రకృతి మనకు బొగ్గు వరంగా ఇచ్చింది

- దీన్ని ప్రజలకు మేలు చేసే విధంగా వాడేలా ప్రభుత్వం ఉండాలి
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఇబ్బందికర పరిస్థితులు ఇప్పుడు అలాగే ఉన్నాయి
- సింగరేణిలో నుంచి బొగ్గు తీసేందుకు కార్మికులు ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు
- ఈ విషయం ఏమాత్రం తెలియని ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉంది
- సింగరేణి తో పెట్టుకున్న ఏ నాయకుడు కూడా బాగుపడలేదు
- సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు యువ కార్మికులకు కూడా తెలియాలి
- చెమట చిందించి లాభాలు తెస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా ఇస్తే అభ్యంతరం ఏంటీ?
- స్వయంప్రతిపత్తి కలిగిన సింగరేణికి...ప్రభుత్వం పెట్టే రూల్స్ అప్లయ్ కావు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సింగరేణిని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికి సిద్ధమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. డిపెండెంట్ కార్మికుల నియామకాలపై విజిలెన్స్, ఏసీబీ విచారణ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కార్మికుల నియామకాలపై కాదు మీ ప్రభుత్వ అవినీతిపై విచారణకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఆదివారం బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో సేవ్ సింగరేణి రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ దేశంలోనైనా, ఏ రాష్ట్రం లోనైనా సహజ వనరులను అక్కడి ప్రజలకు ఉపయోగపడే విధంగా వాడేందుకు ప్రయత్నం చేస్తారు. ప్రకృతి మనకు బొగ్గు వరంగా ఇచ్చింది. దీన్ని ప్రజలకు మేలు చేసే విధంగా వాడేలా ప్రభుత్వం ఉండాలి. కానీ ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఉండేవో...ఇప్పుడు

మిగతా2లో...





2

## జడ్జీలకే రక్షణ కల్పించలేక పోయారు

- ప్రభుత్వం 'మహా జంగల్‌రాజ్'గా మారింది
- ఏ రాజ్యాంగ వ్యవస్థ ప్రాముఖ్యతను టీఎంసీ ప్రభుత్వం గుర్తించదు
- ఈ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది
- బెంగాల్ ప్రభుత్వంపై ప్రధాని మోడీ విమర్శలు

# క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం




**తెలంగాణబ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశంలోని యువత క్రీడా మైదానాలను ఎందుకు వదిలేసిందన్న అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను సరైన మార్గంలో పెట్టకపోతే దేశం ప్రమాదకర పరిస్థితులకు నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 74వ బోలానాథ్ ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "యువత నెమ్మదిగా క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలను వదిలిపెట్టి యువత తప్పు చేస్తున్నారు. దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి. యువత సరైన దశలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుంది అని హెచ్చరించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. క్రీడాకారులను తయారు చేసి దేశ ప్రతిష్టను నిలబెట్టాలి. యువతను క్రీడల్లో ప్రోత్సహించండి అని పిలుపునిచ్చారు. భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి విశేష పేరు ప్రఖ్యాతులున్నాయి. 1950 60 దశకంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరు గడించింది. దేశంలోనే ఫుట్‌బాల్‌ను అంతగా ఆదరించింది. 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే. ఆ క్రమంలో ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈ క్రీడల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన పోలీసు విభాగానికి మనస్ఫూర్తిగా అభినందనలు. దేశం నలుమూలల నుంచి ఈ క్రీడల్లో పాల్గొని అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన టీమ్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రిగా అందరికీ అభినందనలు. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ ఒలింపిక్స్‌లో కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోవడం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. గతంలో ఇదే గచ్చీబౌలీలో ఎన్నో క్రీడలు నిర్వహించాం. గడిచిన కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో మనవాళ్లు ఓడిపోగానే కొద్దిరోజులు చర్చించి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల వలలో పడి నిర్వీర్యమైపోతోంది. వీరుల భూమి, ఎంతోమంది త్యాగధనులకు కేంద్రమైన పంజాబ్‌లో ఈరోజు మాదకద్రవ్యాల గురించి వినిపిస్తోంది. అందుకే ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. ఎంతో మంది నిష్ణాతులతో కలిసి రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పాం. క్రీడల్లో రాణించిన వారికి అన్ని విధాలుగా ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలతో సమాజంలో సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పోలీసు విభాగాలకు చెందిన క్రీడాకారులు మైదానాల్లో ఎలాగైతే ప్రతిభను, స్ఫూర్తిని కనబరిచారో సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నియంత్రణలో కూడా ప్రతిభను కనబరచాలి.. అని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ చాంపియన్ షిప్, ముగింపు కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, సీఐడీ డీజీ శిఖా గోయల్, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ స్వప్న తివారి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా మైదానంలో మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ట్రోఫీలను అందించారు.

# జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయారు

**నేషనల్ బ్యూరో:** పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల న్యాయాధికారులను ఘెరావ్ చేసిన ఘటనపై ప్రధాని మోడీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై మండిపడిన ఆయన.. ప్రభుత్వం 'మహా జంగల్‌రాజ్'గా మారిందన్నారు. కూచ్ బెహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయిందని.. ఇక సాధారణ ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తుందని విమర్శించారు. ''మాల్దాలో జరిగిన ఘటన తృణమూల్ కాంగ్రెస్ మహా జంగల్ రాజ్‌ను ప్రతిబింబిస్తోంది. ఏ రాజ్యాంగ వ్యవస్థ ప్రాముఖ్యతను టీఎంసీ ప్రభుత్వం గుర్తించదు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ఇక్కడ పరిస్థితి ఎలా ఉందంటే.. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ఈ రాష్ట్రప్రభుత్వం కంకణం కట్టుకుంది'' అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. ఇలాంటి ప్రజలకు రక్షణ కల్పిస్తుందని ప్రభుత్వం బెంగాల్ నుంచి ఆశించలేమన్నారు. మాల్దాలో ఇటీవల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో పాల్గొన్న ఏడుగురు జడ్జీలను.. జాబితాలో పేర్లు గల్లంతైన కొందరు స్థానికులు ఘెరావ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎంఐఎం పార్టీకి చెందిన ఒక వ్యక్తిని బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ఇదే ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (NIA) కూడా విచారణ చేపడుతోంది.

# న్యాయం కోసం మహా ప్రాంగణం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** న్యాయం కోసం నిర్మించే ప్రాంగణం అన్ని మతాల ప్రజలకు పవిత్ర స్థలం లాంటిదని : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు జోన్2 శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసందర్భంగా మాట్లాడారు. ఇది తన ప్రభుత్వానికి జీవితంలో ఒకసారి వచ్చే గొప్ప అవకాశం అని తెలిపారు. ఈ రోజు ప్రత్యేకమైన రోజు అని, భారతదేశంలోని అగ్రశ్రేణి న్యాయ మేధావులతో కలిసి ఉండటం గౌరవంగా ఉందని అన్నారు. దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారా నిర్మించడం గొప్పదే కానీ, కోర్టు నిర్మించడం సమాజానికి మరింత గొప్ప సేవ అని చెప్పారు. న్యాయం కోసం ఒక వేదికను నిర్మించడం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేయడమేనని స్పష్టం చేశారు. మన ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పర గౌరవంతో పనిచేయాలని తెలిపారు. సాధారణ పౌరుడికి కోర్టు చివరి ఆశ్రయం అని అన్నారు. అందుకే తెలంగాణకు కొత్త హైకోర్టు నిర్మాణం ప్రారంభించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ భవనం కేవలం నిర్మాణం కాదని, ప్రజాస్వామ్య విలువలకు ప్రతిబింబమని చెప్పారు. పేదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజలు తమ వేదనను వినిపించుకునే వేదికగా ఇది నిలుస్తుందని తెలిపారు. రాబోయే వందేళ్ల పాటు ఈ న్యాయ మందిరం సమాజానికి సేవ చేస్తుందని అన్నారు.

**100 ఎకరాలకు పైగా కేటాయించాం**

రాజేంద్రనగర్‌లో 100 ఎకరాలకు పైగా భూమిని ఈ ప్రాజెక్టుకు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే జోన్1లో పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ రోజు జోన్2లో నివాస భవనాలకు శంకుస్థాపన చేస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ 2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 49 కోర్టుల నిర్మాణం, అనేక నివాస సముదాయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడం కార్యనిర్వాహక విభాగం బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని వ్యవస్థలు పరస్పర సహకారంతో పనిచేయాలని, విభేదాలను నివారించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తీర్పులకు మాత్రమే కాకుండా, న్యాయవ్యవస్థ అభిప్రాయాలకు కూడా గౌరవం ఇవ్వాలని తెలిపారు. ఈ రోజు హైదరాబాద్‌కు సుదినమని పేర్కొన్న ముఖ్యమంత్రి, వచ్చే శతాబ్దానికి ఒక అద్భుతమైన న్యాయ భవనాన్ని నిర్మించడానికి తొలి అడుగు పడిందన్నారు. 'న్యాయం' అనే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని జరుపుకుందామని ఆయన అన్నారు.

# సింగరేణిని కాపాడుకునేందుకు మరో ఉద్యమానికి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. అప్పుడు మన తెలంగాణ వాళ్లు దుబాయి, బొంబాయి, బొగ్గుబాయి అంటూ వెళ్లేవారు. మనకు తినటానికి తిండి లేని సమయంలో కార్మికులకు తిండి పెట్టిన సింగరేణిని మనం సిరులవేణి అని తలుచుకుంటాం. కానీ ఇప్పుడున్న ప్రభుత్వానికి సింగరేణితో ఎలాంటి భావోద్వేగం లేదు. అందుకే కార్మికుల సమస్యలు వారికి తెలియటం లేదన్నారు. సింగరేణిలో నుంచి బొగ్గు తీసేందుకు కార్మికులు ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని అక్కడి గాలి పీల్చుకుంటే ఊపిరితిత్తుల్లోకి వెళ్లి బ్లాక్ అవుతుంది. కాళ్లు వంకర అయ్యే పరిస్థితి ఉంటుంది. కాలే కడుపుతో పోయి కాలే బొగ్గు తీసుకొచ్చే వాళ్లు మన కార్మికులు. కానీ ఈ విషయం ఏమాత్రం తెలియని ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉండటంతో వారికి మన కష్టాలు తెలియటం లేదన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత మనం కొంతమందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో నష్టపోయాం. అందుకే కొన్ని సడలింపులు ఇచ్చుకొని 20 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చుకున్నాం. దీంతో ఒక 20 వేల మంది భద్రతతో బతుకుతున్నారు. ఇప్పుడు వాళ్ల మీద ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కన్నుపడిందని ఆరోపోంచారు. ఈ ఉద్యోగాలు ఎలా ఇచ్చారన్న దానిపై ఎంక్వైయిరీ వేస్తారంట? వాళ్లకు ఉద్యోగాలు ఎందుకు ఇచ్చామన్న కారణం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలుసుకోవటం లేదు. ఆనాటి గవర్నమెంట్ పాలసీ అది. దానిపై ఎలా ఎంక్వైరీ చేస్తారు? సింగరేణి తో పెట్టుకున్న ఏ నాయకుడు కూడా బాగుపడలేదని సింగరేణి కార్మికులతో పెట్టుకోవద్దని భట్టిని నేను హెచ్చరిస్తున్నానన్నారు. ఓబీ కాంట్రాక్టులు, డీజిల్ కుంభకోణాలు, కరప్ట్ నాయకులు, అధికారుల మీద ముందు ఎంక్వైయిరీ వేయండి. కష్టపడి చెమటోడ్చే కార్మికుల మీద ఎంక్వైయిరీ లు వేయటం ఏంటీ? సింగరేణి బొగ్గు మింగి అవినీతికి పాల్పడిన వాళ్ల మీద విచారణ జరపాలన్నారు. భట్టి మీద నాకు కొంచెం గౌరవం ఉండేది. కానీ సింగరేణి కార్మికుల మీద మొన్న అసెంబ్లీలో ఆయన మాట్లాడిన మాటలు విన్నాక చాలా బాధ అనిపించిందన్నారు. కార్మికుల గురించి భట్టి మాట్లాడిన అంశాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని కార్మికుల మీద ఎంక్వైయిరీ వేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. డీజిల్ కుంభకోణం ద్వారా 250 కోట్లు, నిబంధనల ఉల్లంఘన కారణంగా 74 కోట్లు, లీకేజీ ల కారణంగా 24 కోట్లు, అదనపు వసూళ్లు చేయలేక 1078 కోట్లు సంస్థకు నష్టం చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని కాగ్ చెబుతోందని దీని మీద ముందు ఎంక్వైయిరీ వేయాలన్నారు. మీ చేతగానితనంతో సింగరేణికి నష్టం చేస్తున్నారని ఆరోపించారు.

**కిషన్ రెడ్డి వెళ్లి మాట్లాడగానే మారుతుంది.,**

కిషన్ రెడ్డి వెళ్లి మాట్లాడగానే సంస్థలో బొగ్గు ప్రొడక్షన్ మారుతుంది. చెమట చిందించి లాభాలు తెస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా ఇస్తే అభ్యంతరం ఏంటీ? స్వయంప్రతిపత్తి కలిగిన సింగరేణికి...ప్రభుత్వం పెట్టే రూల్స్ అప్లయ్ కావు. బొగ్గు, కరెంట్ బకాయిలు కలిపి సింగరేణికి ఈ ప్రభుత్వం 47 వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. వాటిని చెల్లించకపోవటంతో కార్మికుల సేఫ్టీకి, వారి జీతాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజస్థాన్ తో సోలార్ ఒప్పందం, అదే విధంగా చిన్న కంపెనీతో లిథియం రిఫైనరీ అంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు యువ కార్మికులకు కూడా తెలియాలి. లిథియం రిఫైనరీ కోసం అల్ట్ మిన్ అనే చిన్న సంస్థతో సింగరేణి 2250కోట్ల ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థను 2023 లో ఏర్పాటు చేశారు. ఆ సంస్థ మొత్తం ఆదాయం రూ. 27 లక్షలు మాత్రమే. అలాంటి చిన్న కంపెనీతో సింగరేణి 2250 కోట్ల ఒప్పందం ఎలా చేసుకుంటుంది? అని నిలదీశారు. సింగరేణి విషయంలో సిన్సియార్ ఉంటే ముందు ఈ ఒప్పందాల విషయం చెప్పండి? అల్ట్ మిన్ కంపెనీ విషయంలో బ్యాంక్ గ్యారంటీలు ఎవరివీ? సింగరేణి వాటా ఎంత? ఆ సంస్థను ఎందుకు పార్ట్ నర్‌గా చేశారు? ప్రపంచ వ్యాప్తంగా లిథియం రిఫైనరీలు పెట్టిన పెద్ద సంస్థలే నష్టాల్లో ఉన్నాయి. అలాంటి ఊరు, పేరు లేని సంస్థతో ఈ ఒప్పందం ఎందుకు చేసుకున్నారన్నారు. రాజస్థాన్‌తో 11 వేల కోట్ల ఒప్పందంలో సింగరేణి వాటా 72 వేల కోట్లు అంటున్నారు. ఒక మెగావాట్ ఉత్పత్తికి అయ్యే దాని కన్నా మూడు రెట్లు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అవుట్ రైట్‌గా ఈ ఒప్పందంలో అవినీతి జరిగింది. దీనిపై మేము లెటర్ రాస్తాం. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న వారి పేర్లు, అవినీతి బయట పెట్టాలన్నారు. మెడికల్ బోర్డును పాత పద్ధతిలో నిర్వహించాలని గతంలో మెడికల్ బోర్డు పెట్టి మళ్లీ నిర్వహించటం లేదున్నారు.

జాగృతి మద్దతు..

విజిలెన్స్ కేసుల విచారణను పూర్తి చేయాలి. ఇన్ కం ట్యాక్స్ సింగరేణి కార్మికులు ఉద్యోగులకు ఉండొద్దు. దీనిపై నేను పార్లమెంట్ లో 2015 లోనే మాట్లాడాను. ఇన్ కం ట్యాక్స్ మినహాయింపులు ఇస్తే 12 వేల నుంచి 80 వేల వరకు ఉద్యోగులకు, కార్మికులకు మేలు జరుగుతుంది. ఇది లైఫ్ రిస్క్ సెక్టార్ కావటంతోనే ఇన్ కం ట్యాక్స్ మినహాయింపు అడుగుతున్నాం. వైద్య పరీక్షల్లో పాసైన 350 మంది అభ్యర్థులకు పోస్టులు ఇవ్వాలి. ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను నింపాలన్నారు. సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని అలియాస్ పేర్ల విషయంలో గతంలో ఉన్న విధంగానే నిబంధనలు ఉండాలన్నారు. హెల్త్ విషయంలో నిమ్స్ రేట్లను కాకుండా కేంద్రానికి సంబంధించి సీజీహెచ్‌ఎంఎస్ రేట్లు అప్లయ్ చేయాలని సింగరేణి విముక్తి కోసం అవసరమైతే మరో తెలంగాణ ఉద్యమం మాదిరి ఉద్యమం చేస్తామన్నారు. హెచ్‌ఎంఎస్ చేసే ఉద్యమానికి జాగృతి తరఫున పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు.

# పార్టీ మారే ప్రసక్తే లేదు

○ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**కరీంనగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పార్టీలు మారడం బట్టలు మార్చుకున్నంత సులభం కాదని, తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ మారే ఆలోచనలో లేనని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల తనపై బీఆర్ఎస్‌లోకి తిరిగి వెళ్తున్నాడన్న ప్రచారం కావాలనే చేస్తున్న దుష్ప్రచారమని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లో పోస్టర్లు పెట్టి తప్పుడు ప్రచారం చేయడం బాధ కలిగించిందని తెలిపారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి అవమానకరంగా బయటకు పంపించారని గుర్తుచేశారు. రాత్రికి రాత్రే బర్తరఫ్ చేసి వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురి చేసిన పరిస్థితులను మరువలేనని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ అదే పార్టీలో చేరతానన్న ప్రచారం అసత్యమని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రస్థానాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పిచ్చి ప్రయత్నాలకు వెంటనే స్వస్తి పలకాలని హెచ్చరించారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, తాను ప్రస్తుతం ఉన్న రాజకీయ మార్గంలోనే ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. వ్యక్తిత్వాన్ని కించపరిచే ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ప్రైవేట్ కంటే అద్భుత సేవలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** సనత్ నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను జూన్ 2న ప్రారంభిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వెయ్యి పడకలతో అత్యంత ఆధునికంగా నిర్మించే ఈ ఆసుపత్రిలో ప్రత్యేకంగా 50 పడకలను విదేశీయులకు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. కొత్తపేట, అల్వాల్ టిమ్స్ హాస్పిటల్స్ లోనూ ఇలాగే విదేశీయుల కోసం 50 చొప్పున బెడ్స్ కేటాయిస్తామన్నారు. మెడికల్ టూరిజం ద్వారా ప్రభుత్వ వైద్యరంగానికి మరింత ఊతం కల్పించేందుకు ఈ చర్య దోహం చేస్తుందన్నారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం హైదరాబాద్ కు వైద్య సేవల కోసం ఆఫ్రికన్, మిడిల్ ఈస్ట్ కంట్రీస్ నుంచి అనేక మంది రోగులు వస్తున్నారని... అయితే ప్రభుత్వ రంగంలోనూ వారికి వైద్య సేవలు అందించి ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ప్రైవేటు హాస్పిటల్స్ తో పోలిస్తే ఎంతో నిపుణులైన వైద్యులు ప్రభుత్వ హాస్పిటల్స్ లో ఉన్నారని... ఎంతో క్రిటికల్ సర్జరీలు చేయడంలో వారు సిద్ధహస్తులన్నారు. అందుకే ప్రైవేటు కంటే అద్భుత సేవలు అందిస్తూ విదేశీయులను సైతం ప్రభుత్వ హాస్పిటల్స్ కు ట్రీట్ మెంట్ కోసం వచ్చేలా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మెడికల్ టూరిజం ద్వారా ప్రభుత్వం ఆదాయం ఆర్జించేందుకు ఎలాంటి చర్యలు తీసుకునాలనే అంశంపై ఓ కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మరోవైపు టిమ్స్ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని అన్నారు. మెరుగైన వైద్య సేవలందించేందుకు గాను సాధారణ వైద్య ఛార్జీలు వసూలు చేసే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. టిమ్స్ హాస్పిటల్స్ లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ హాస్పిటల్స్ తరఫున ఇంతవరకు ఒక్క అంతర్జాతీయ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించలేదని... ఇకపై ఏటా నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రెఫరల్ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఉమ్మడి జిల్లా కేంద్రం పరిధిలోని ఏ హాస్పిటల్ నుంచైనా హైదరాబాద్ కు రోగులను పంపించకుండా... కచ్చితంగా సదరు రెఫరల్ ఆసుపత్రికే రెఫర్ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఉస్మానియా, గాంధీ తరహాలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని రెఫరల్ ఆసుపత్రిలోనూ అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులో ఉంచుతామన్నారు. త్వరలో ముఖ్యమైన ఆసుపత్రులకు గ్రూప్1 అధికారులను నియమిస్తామన్నారు. ఫలితంగా వైద్యసేవలు మరింత మెరుగవుతాయని తెలిపారు.

# ఆ 5 గ్రామాలను టీజీలో కలపండి

**ఖమ్మం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఖమ్మం జిల్లా భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తెలంగాణలో కలిపే అంశం మరోసారి చర్చనీయాశంగా మారింది. ఈ అంశంపై తాజాగా ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. భద్రాచలం పక్కనున్న 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని అందులో కోరారు. పాలనా సౌలభ్యం కోసం వీటిని భద్రాచలంలో కలపాలని ఇలా చేయడం ద్వారా గిరిజనుల సమస్యలు..తొలగుతాయని పేర్కొన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టేలా చూడాలని కోరారు. కాగా గత గువారం ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుపైన రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణకే ఇవ్వాలని టీజీ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కేంద్రాన్ని కోరారు. ఏపీ విభజన హామీలను రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని, హామీలను అమలు చేయనందుకు నష్టపరిహారం చెల్లించాలని ఆమె నిలదీశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను విస్మరించారని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్టీపీసీ హామీలను నెరవేర్చలేదని రేణుకా చౌదరి విమర్శించారు. తెలంగాణకు మొండి చెయ్యి చూపిస్తున్నారని, ఐదు గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలని, తెలంగాణలో ఉండాలనుకునే వాళ్లను ఏపీలో కలిపారని ఆమె తెలిపారు.

# పొంగులేటి భూ దందా

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నాదర్‌గుల్‌లోని విలువైన ప్రభుత్వ భూములపై రూ. 7 వేల కోట్ల మేర భారీ కుంభకోణం జరుగుతోందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 373 ఎకరాల ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని అధికార పార్టీ నేతలు కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ భూములు ప్రభుత్వానికి చెందినవని న్యాయస్థానాలు స్పష్టంగా చెప్పినా, అధికార బలంతో వాటిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. పేద రైతులను భూముల్లోకి రానివ్వకుండా గుండాలు, పోలీసులు కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నాదర్‌గుల్‌లోని సంబంధిత భూములను గతంలోనే ప్రభుత్వ భూములుగా ప్రకటించారని హరీశ్‌రావు తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో అసెంబ్లీలో ప్రకటించి పరిశ్రమల అభివృద్ధి సంస్థకు అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ భూములపై జరిగిన కొనుగోలు-అమ్మకాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం 2022లో ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసిందని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు లేవని చెప్పారు.



**రైతులపై ఒత్తిళ్లు**

ఈ భూముల్లో దశాబ్దాలుగా సాగు చేస్తున్న సుమారు 600 మంది రైతులను భూముల్లోకి రానివ్వడం లేదని ఆరోపించారు. మహిళా రైతులు కౌసల్య, మమత వంటి వారు 40 ఏళ్లుగా ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారిని వెళ్లగొట్టేందుకు తక్కువ మొత్తంలో డబ్బు చూపించడం, బోర్లు ధ్వంసం చేయడం, కంచెలు కూల్చడం వంటి చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గుండాల ద్వారా బెదిరింపులు చేయిస్తూ, పోలీసుల ద్వారా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఈ భూ కుంభకోణం వెనుక రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. సంబంధిత సంస్థల్లో మంత్రి కుటుంబ సభ్యులు భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లపై కఠిన చర్యలు తీసుకునే అధికారులు, భారీ భూ కబ్జాలపై ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని విమర్శించారు.

**చెరువులు, గుట్టల ఆక్రమణ**

నాదర్‌గుల్‌లోని 373 ఎకరాల్లో 17 ఎకరాల లచ్చమ్మ కుంట, 6 ఎకరాల రక్షణ పరిధి ఉందని తెలిపారు. ఆ చెరువుకు వచ్చే నీటి మార్గాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. అదేవిధంగా 80 నుంచి 100 ఎకరాల గుట్టలను కూడా తవ్వకాలు చేసి మింగేశారని పేర్కొన్నారు. నగర పరిధిలో ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రేపు ఉదయం వరకు అధికారులు నాదర్‌గుల్ భూములపై చర్యలు తీసుకోకపోతే ప్రజా ప్రతినిధులతో కలిసి అక్కడికి వెళ్లి ఆందోళన చేపడతామని హరీశ్‌రావు హెచ్చరించారు. అక్రమ కబ్జాలను తొలగించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పేద రైతులను తిరిగి భూముల్లోకి అనుమతించాలని డిమాండ్ చేశారు.

# కేరళంలో భూభారతి అమలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి ముతర రాజ్‌కు మద్దతుగా ఆదివారం నాడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని తెలిపారు. అదే విధంగా కేరళంలోకూడా యూడిఎఫ్ ప్రభుత్వం ఏర్పడితే ఐదు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేరళంలో గత పది సంవత్సరాలుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక రంగాల్లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.



"కేరళం ప్రజలు ఈసారి స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు. పది సంవత్సరాల అసమర్థ పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్‌కు అధికారం అప్పగించాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బీజేపీకి కేరళంలో స్థానం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమేనని స్పష్టం చేశారు. "ఇది సాధారణ ఎన్నిక కాదు.. కేరళం భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక. ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించి, యూడిఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి ప్రచారానికి ప్రతిచోట ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# దిశా లా ఫర్మ్ ఆధ్వర్యంలో పంజాగుట్టలో రక్తదాన శిబిరం విజయవంతం



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పంజాగుట్టలోని దిశా లా ఫర్మ్, సంస్థ వ్యవస్థాపకుడు నాగేశ్వర్ రావు పూజారి జన్మదిన సందర్భంగా, ఏప్రిల్ 5, 2026న రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు, సిబ్బంది, స్నేహితులు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణాలను కాపాడే మహోన్నత కార్యానికి మద్దతు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు సంస్థ ప్రాంగణంలో నిర్వహించారు. అర్హత కలిగిన వైద్య నిపుణుల పర్యవేక్షణలో కార్యక్రమం సాగింది. సీనియర్ రెసిడెంట్ డా. పుష్పజ ఆధ్వర్యంలో, NIMS బ్లడ్ బ్యాంక్ వైద్య బృందం సహకారంతో అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ సురక్షితంగా రక్త సేకరణ నిర్వహించారు. ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితుల్లో రక్తానికి ఉన్న నిరంతర అవసరాన్ని తీర్చడం, స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. "ఒక రక్తదాత మూడు ప్రాణాలను కాపాడగలడు" అనే శక్తివంతమైన సందేశాన్ని నిర్వాహకులు పునరుద్ఘాటిస్తూ మరింత మంది ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దిశా లా ఫర్మ్ వ్యవస్థాపకుడు నాగేశ్వర్ రావు పూజారి, రక్తదానం చేసిన ప్రతి దాతకు, సేవకులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయ సేవలతో పాటు సమాజానికి సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సమిష్టి కృషి మరియు సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆరోగ్య అవగాహన మరియు మానవతా విలువలను ప్రోత్సహించేందుకు దిశా లా ఫర్మ్ కట్టుబడి ఉందని తెలిపారు.

**రక్తదాన కార్యక్రమ ముఖ్యాంశాలు:**

- న్యాయవాదులు, నిపుణులు మరియు ప్రజల నుండి మంచి స్పందన
- వైద్య నిపుణుల పర్యవేక్షణలో సురక్షిత రక్తదాన ప్రక్రియ
- సీనియర్ రెసిడెంట్ డా. పుష్పజ & NIMS బ్లడ్ బ్యాంక్ బృందం వైద్య సహాయం
- సేకరించిన రక్తాన్ని NIMS ఆసుపత్రికి అందజేత
- స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంపు
- అత్యవసర అవసరాల కోసం రక్త గ్రూప్ వివరాలు నమోదు చేసుకోవాలనే ప్రోత్సాహం

కేసీఆర్ క్యాంపు కార్యాలయం పై

# దాడి కాంగ్రెస్ పతనానికి ఆరంభం

- రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలు
- కాంగ్రెస్ గుండా గిరికి ప్రజలే సమాధానం చెబుతారు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణను అభివృద్ధి చేసిన మహానేత కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం వారి పతనానికి ఆరంభమని అల్లాదుర్గం మండల్ పార్టీ అధ్యక్షుడు పల్లె గద్ద నరసింహులు మండిపడ్డారు. గజ్వేల్లో కెసిఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పై జరిగిన దాడి ఘటనను ఆయన ఖండిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.ఈ సందర్భంగా పల్లె గద్ద నరసింహులు మా



ట్లాడుతూ..అధికారంలోకి వచ్చామన్న అహంకారంతో కాంగ్రెస్ నాయకులు అరాచకాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయంగా కేసీఆర్ ని ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం రేవంత్ సర్కార్ పిరికితనానికి నిదర్శనం అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి కార్యాలయానికే రక్షణ లేకపోతే,రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎక్కడున్నాయని ఆయన ప్రశ్నించారు. పోలీసులు కూడా అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ ప్రేక్షక పాత్ర వహించడం దారుణమ న్నారు. గుండాయిజంతో బీఆర్ఎస్ పార్టీని నాయకులను భయపెట్టాలని చూస్తే అది మీ భ్రమ మాత్రమేనని బీఆర్ఎస్ కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నాయకులు రోడ్ల మీద తిరగలేరన్నారు. మా సహనాన్ని బలహీనతగా ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.అరాచక పాలన సాగిస్తున్న కాంగ్రెస్కు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు.





# భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో గురుజువాడ గ్రామంలో క్రైస్తవుల పవిత్ర పర్వదినమైన ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఆశ, నూతన జీవం, పునర్జన్మకు ప్రతీకగా భావించే ఈ పండుగను విశ్వాసులు ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు.యేసు క్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున శిలువ వేయబడిన అనంతరం మూడవ రోజు పునరుత్థానం చెందిన సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించడం విశేషం..ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జి సమృద్ధి సందేశం ఇస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.కుటుంబ సమేతంగా పాల్గొన్న విశ్వాసులు పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

- జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్





# అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్

**జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అణగారిన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉద్దాల జైపాల్ అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధుడు,దివంగత మాజీ ఉప ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఉద్దాల జైపాల్ మాట్లాడుతూ..స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని జైలుశిక్ష అనుభవించిన మహానుభావుడని పేర్కొన్నారు.అంటరానితనాన్ని నిర్మూలించేందుకు,సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు జీవితాంతం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అలాగే రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తో కలిసి సామాజిక న్యాయం కోసం కృషి చేసి, అట్టడుగు వర్గాలకు హక్కులు అందేలా కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. దేశ నిర్మాణంలో వ్యవసాయం,కార్మిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,మోమిన్‌పేట్ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, సర్పంచ్ సంధ్య సుభాష్‌గౌడ్, నాయకులు సురేష్,జై భీమ్ అధ్యక్షుడు నర్సింలు,జై భీమ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్కతల లోఅంబేద్కర్ యువజన సంఘం

# నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడుగా బొడ్డు చిట్టిబాబు

**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండలంలోని ఎంకతల గ్రామంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బొడ్డు చిట్టిబాబు ఎన్నిక కాగా,ఉపాధ్యక్షుడిగా కట్టెల కార్తీక్, కార్యదర్శిగా డప్పు శ్రీనివాస్, కోశాధికారిగా మేతరి విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.అలాగే మీడియా ఇంచార్జిగా రామగల మధుకర్, క్రీడా కార్యదర్శులుగా డబ్బు రమేష్, రామగల ప్రేమ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సూర్యాపేట సతీష్, మేతరి మోహన్ తదితరులు ఎంపికైనట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బొడ్డు చిట్టిబాబు మాట్లాడుతూ..ఏప్రిల్ 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక సమానత్వం,న్యాయం కోసం డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను విజయవంతం చేయడానికి గ్రామంలోని సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత మరియు అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఆయన కోరారు.ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



# ఘనంగా బీరప్ప బోనాలు

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** న్యాల్కల్ మండలంలోని టేకుర్ గ్రామంలో బీరప్ప స్వామి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకొని బీరప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఉత్సవాల్లో భాగంగా పోతురాజు విన్యాసాలు ఆకట్టుకోగా, బీరప్ప స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీత నాగేశ్వర్,గ్రామ పెద్దలు బక్కయ్య, స్వామి వీరన్న,బీరప్ప, మల్లన్న, బాబురావు పటేల్, రమేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.అలాగే చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.



# వైభవంగా దుర్గమ్మ దేవతకు బోనాలు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం దుర్గమ్మ దేవతకు వైభవంగా బోనాలు తీశారు.ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలను పూలదండలు, వేపకొమ్మలతో అందంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఆటపాటలతో డప్పు చప్పుల నడుమ దుర్గమ్మ దేవతకు గోవిందా అని స్మరించుకుంటూ ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.ఈ ఉత్సవాలు తిలకించడానికి వందలాది మంది భక్తుల తరలివచ్చారు.



# అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్

- సర్పంచ్ మటపతి శ్వేతా సూర్యకాంత్

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారతదేశ స్వాతంత్ర ఉద్యమంతో పాటుగా అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటాలు చేసిన యోధుడు బాబు జగ్జీవన్ రామ్,అనీ ఎత్తొండ గ్రామ సర్పంచ్ మటపతి శ్వేతా సూర్యకాంత్ అన్నారు.ఆదివారం కోటగిరి మండలంలోని ఎత్తొండ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం,ఎత్తొండ దళిత ప్రతినిధుల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆమె పూల మాలలు వేసి ఆ మహనీయునీకి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ నడిచిన బాట,పాటించిన ఆదర్శాలను, చూపిన సంస్కరణలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఎత్తొండ గ్రామ ప్రజా ప్రతినిధులు,నాయకులు, యువకులు ,బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం సభ్యులు,ఎత్తొండ దళిత సంఘం ప్రతినిధుల, ప్రజలు,పాల్గొన్నారు.

# మోమిన్‌పేట్‌లో ఘనంగా ఈస్టర్ పర్వదినం

- విశ్వాసులతో నిండిన ప్రార్థనా మందిరాలు





**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** యేసుక్రీస్తు శిలువ వేయబడిన తర్వాత తిరిగి లేచిన మహత్తర సందర్భాన్ని స్మరించుకుంటూ ఈస్టర్ పర్వదినాన్ని మోమిన్‌పేట్‌లో విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, యేసుక్రీస్తు బోధించిన ప్రేమ,శాంతి, క్షమాభావం సందేశాలను స్మరించారు.ఈ సందర్భంగా పాస్టర్ విజయ్ కుమార్, పాస్టర్ శైలేష్ ఆధ్వర్యంలో ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు యేసుక్రీస్తు పునరుత్థానం ప్రపంచానికి ఆశ, నూతన జీవితం, ఆధ్యాత్మిక శక్తికి ప్రతీక అని పేర్కొన్నారు.పాస్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ..యేసుక్రీస్తు త్యాగం మానవాళికి మార్గదర్శకమని, ఆయన పునరుత్థానం విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు.పాస్టర్ శైలేష్ మాట్లాడుతూ.. ప్రేమ, కరుణ, సహనమే యేసు బోధల సారాంశమని, ప్రతి ఒక్కరూ వాటిని ఆచరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. చర్చిలు అలంకరణలతో అందంగా మెరిసి,ఈస్టర్ పండుగ సందడి నెలకొంది.




# అణగారిన వర్గాల ఆశాజ్యోతి.. బాబూ జగ్జీవన్ రామ్

- పేద ప్రజల అభ్యున్నతి కొరకు నిరంతరం పాటుపడిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్
- బీజేపీ నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి గ్రామ పంచాయతీ లో బాబూ జగ్జీవన రామ్ జయంతి (సమతా దివస్) సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అట్టడగు,వెనకబడిన రాష్ట్రం నుండి వచ్చి అణగారిన వర్గాల కోసం , సమానత్వం కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్ రామ్ అంతేగాక దశాబ్దాల కాలం పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని,మరియు కేంద్ర మంత్రి వర్యులు గా దేశ ప్రజలకు వివిధ హోదాలో సేవలు అందించిన,అణగారిన వర్గాల ఆశాజ్యోతి,భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వారినీ గుర్తు చేసుకోవడం జరిగింది. దేశాభివృద్ధికి మరియు సామాజిక సమానత్వం కోసం వారు చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిది అని వారి ఆశయాల కోసం నిరంతరం కృషి చేస్తామని తెలియచేయడం జరిగింది. అదేవిధంగా వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య,గ్రామ పెద్దలు గుండా భూపాల్ రెడ్డి,కొండా మహిపాల్,బి.నరేష్,దార శేఖర్,గుండా లింగా రెడ్డి,మహేందర్ తదితరులు బాబూ జగ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

# సహజ వనరులను దోచుకునే అక్రమార్కులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు

- కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్ పట్టివేత
- ఉదయం 2 గంటల సమయంలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు
- ఇసుక ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు
- దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు
- ఎక్కడైనా అక్రమ దందాలు జరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- మండలంలో అక్రమ కార్యకలాపాలపై గట్టి నిఘా
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సహజ వనరులను దోచుకునే అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ హెచ్చరించారు. ఆదివారం పెద్దేముల్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో చోటుచేసుకుంది.ఈ సందర్భంగా పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ మాట్లాడుతూ..రాత్రి వేళల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,ఆదివారం తెల్లవారుజామున జరిగిన తనిఖీల్లో భాగంగా పెద్దేముల్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో ఏలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకున్నామన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.మండలంలో గుట్టు చప్పుడు కాకుండా జరిగే అక్రమ కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా పెద్దేముల్ మండలంలో అక్రమార్కులు ఎవరైనా,ఎక్కడైనా అక్రమ దందాలకు పాల్పడితే ప్రజలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని సూచించారు.



# ఘనంగా బాబు జగ్జీవన్ రావు జయంతి వేడుకలు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారత స్వతంత్ర సమరయోధుడు,గొప్ప సంఘసంస్కర్త,డాక్టర్. బాబు జగ్జీవన్ రావ్ వేడుకలు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మండల కేంద్రంలో అల్లాదుర్గం చౌరస్తా వద్ద నక్క సూర్య కుమార్ ఆధ్వర్యంలో అప్పాజీపల్లి గ్రామంలో సర్పంచ్ గంధాలి రవి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం కృషిచేసిన మహనీయుడని, ఆనాటి కేంద్ర మంత్రివర్గంలో ఉప ప్రధానిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవాన్ని సహకారం చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. అలాగే మండల కేంద్రమైన అల్లాదుర్గంలో జగ్జీవన్ రావ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సేవకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బాబు జగ్జీవన్ రావ్ సేవలు మరువలేనివని,ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యకుమార్,మోహన్ రాథోడ్,క్రాంతి కుమార్ తదితరులున్నారు.



# మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడచుకోవాలి

- సర్పంచ్ రామావత్ భీమి బాయి
- కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** దేశంలో సామాజిక న్యాయ సాధనకు గొప్ప కృషిచేసిన సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్. బాబు జగ్జీవన్ రామ్, 118 జయంతి పురస్కరించుకొని కోహిర్ మండలంలోని పీచేర్యాగడి పాత తాండ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రామావత్ భీమి బాయి,కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్, మాట్లాడుతూ..ఒకవైపు దేశ స్వాతంత్రం కోసం పోరాడుతూనే,మరోవైపు సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల హక్కుల కోసం ఆలు పెరగని సమరం సాగించిన యోధుడు సమానత్వం కోసం పోరాడిన ఆదర్శనేత కులరహిత సమాజంకోసం తన జీవితాంతం కృషి చేసిన బడుగు బలహీన వర్గాల నేత మహనీయుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫక్కు సింగ్,రామావత్ సోమ్లా నాయక్, కేతావత్ కిషన్,రామావత్ వకీల్, రామావత్ పరశురామ్,బానోత్ రాములు,రామావత్ లక్ష్మణ్,రవి,ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



## రాజుపేటలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**- వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ మోదుగు వీరభద్రం**

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాజుపేట గ్రామంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు.కార్యక్రమానికి పేరికసింగారం మాజీ ఎంపీటీసీ శ్రీ మోదుగు వీరభద్రం హాజరై, జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత” అని పేర్కొన్నారు.యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలి” అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ మహేష్ కిన్నెర ఉపేందర్,ఉప్పల సురేష్,సబ్బు జానకి రాములు,ఉప్పల గోపి,మంద ఉపేందర్,ఉప సర్పంచ్ సోలిపురం ప్రభాకర్ రెడ్డి,కందాల కమలాకర్ రెడ్డి,ఉప్పల వీరభద్రం మరియు గ్రామ ప్రజలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొని మహానేతకు ఘన నివాళులర్పించారు.

## సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన యోధుడు
# బాబు జగ్జీవన్ రామ్

- జనగాం గ్రామంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు
- అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తో కలిసి సామాజిక న్యాయానికి బాటలు
- బంగ్లాదేశ్ యుద్ధంలో కీలక పాత్ర పోషించిన నేత
- హరిత విప్లవానికి దోహదం చేసిన దూరదృష్టి గల నాయకుడు
- నేటి యువతకు,సమాజానికి బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శం
- ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ
- ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సమాజంలో బడుగు బలహీన వర్గాల,పీడిత ప్రజల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని ఎమ్మార్పీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ,ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ లు అన్నారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు,సంఘ సంస్కర్త,మాజీ ఉపరాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలలో భాగంగా జనగాం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..1935లో అంటరానితనం పారదోలేందుకు, ప్రజలందరికీ సమానత్వం కోసం "ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్"అనే సంస్థ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు.రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలిసి సామాజిక న్యాయం కోసం తన వంతు కృషి చేశారని గుర్తు చేశారు.తద్వారా రాజ్యాంగ ఫలాలు దేశంలోని అట్టడుగు వర్గాలకు అందడంలో భూమిక పోషించారని అన్నారు.1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా,ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాలకు అనుగుణంగా సేనలను నడిపించి బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని తెలిపారు.1974 లో ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో "హరిత విప్లవం" తీసుకురావడంలో బాబు జగజ్జీవన్ రామ్ ది క్రియాశీలక పాత్ర అని కొనియాడారు.సమాజంలోని పీడిత వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ భారత రాజకీయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడన్నారు.ఆయన చూపించిన సమానత్వం, సామాజిక న్యాయం అవకాశాల సమాన పంపిణీకి దారితీసిందని చెప్పారు.దేశ నిర్మాణంలో, ముఖ్యంగా వ్యవసాయం, కార్మిక రంగాల అభివృద్ధిలో బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయం అని వివరించారు.బాబు జగజ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుని వారి జయంతిని సమానత్వ దినోత్సవంగా ప్రతి ఏటా ఏప్రిల్ 5వ తేదీన దేశ వ్యాప్తంగా జరుపుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పిస్తున్నామని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్,చరిత్ర నేటి సమాజానికి, ముఖ్యంగా నేటి యువతకు ఆదర్శమని అన్నారు. స్వాతంత్ర ఉద్యమం సందర్భంగా క్విట్ ఇండియా సత్యాగ్రహం తదితర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ కూడా వెళ్లడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో జనగాం గ్రామ పెద్దలు ముకుంద్ రెడ్డి, సంజమొల్ల రాములు, శివ కుమార్,చాకలి మల్లప్ప,దేవప్ప,సంజీవ్,టి.రాజు,గుమ్మడి.రమేష్, చిన్న బాలప్ప, కె.అనంతి,చెక్కల శేఖర్,రాజు రత్నం, బీమని ప్రభాకర్,చెంద్రప్ప,రాజు,అశోక్, అరవింద్, చింటూ,గంజి వెంకటప్ప,రాజేష్,చాకలి రాములు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.





## గౌరు తనయుని వివాహంలో మాండ్ర

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నందికొట్కూర్ టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చెరితమ్మల కుమారుడు గౌరు జనార్దన్ రెడ్డి వివాహం రిసెప్షన్ కర్నూల్ లోని రాగ మయూరి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగింది.ఈ రిసెప్షన్ కు నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మండల శివానందరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## ఆర్ఎంపీ డాక్టర్ ని సన్మానించిన
# ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి

**రాయికల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పట్టణంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాపాయ స్థితికి చేరుకోగా,ఆర్ఎంపీ వైద్య నిపుణుడి సమయస్ఫూర్తితో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఆగ్రో ఫెర్టిలైజర్ దుకాణం ముందర ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో కాశిరెడ్డి నారాయణరెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు.అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఆర్ఎంపీ వైద్య నిపుణుడు పిప్పోజి మహేందర్ బాబు పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని గుర్తించి, వెంటనే సిపిఆర్ కార్డియో పుల్మనరీ రెసుసైటేషన్ చేశారు.ఆయన చేసిన సకాల సహాయంతో బాధితుడు కొద్దిసేపటికి మళ్లీ స్పృహలోకి రావడం జరిగింది.తదుపరి బాధితుడిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు అతనికి అవసరమైన చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్ అనిల్ మాట్లాడుతూ..ప్రమాదం జరిగిన వెంటనే సిపిఆర్ చేయడం వల్లనే బాధితుడి ప్రాణం కాపాడబడిందని తెలిపారు.ఈ సందర్భంగా ఆర్ఎంపీ మహేందర్ బాబు చేసిన సేవలను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ వంటి ప్రాథమిక వైద్య పరిజ్ఞానం ప్రాణాలను కాపాడగలదని ఈ ఘటన మరోసారి నిరూపించింది.సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి ప్రాథమిక చికిత్సా పద్ధతులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు,గన్నె రాజిరెడ్డి, అడ్వకేట్ అల్లే పురుషోత్తం,ఏనుగు మల్లారెడ్డి,కోల శ్రీనివాస్,సురేందర్ నాయక్,మున్ను,మాజీ సర్పంచులు నాయకులు తదితరులు రైతులు పాల్గొన్నారు

## మొక్కజొన్న రైతులకు మద్దతు ధర అందించాలి

**- మార్క్ ఫెడ్ ధరలకే మొక్కజొన్న కొనుగోలు చేయాలి**
**- సిపిఐ(ఎంల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్ర ప్రసాద్**



**పాలేరు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వం 2025 26 సీజన్‌కు మొక్కజొన్న కనీస మద్దతు ధరను 2,400 గా ప్రకటించినప్పటికీ, చాలా చోట్ల రైతులకు ఆ ధర దక్కడం లేదనీ సిపిఐఎంల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్ర ప్రసాద్ అన్నారు తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం గ్రామంలో ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ జరిగింది.ఈ జనరల్ వారికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మార్క్ఫెడ్ ధరకే మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని తేమ శాతం పేరుతో దళారులు తక్కువ ధరకు దళారులకు 1,600 నుండి 1,800 కే అమ్ముకుంటున్నారు. దీనివల్ల క్వింటాల్‌కు 600 నుండి 800 వరకు నష్టపోతున్నారు.సిండికేట్లు మార్కెట్ యార్డుల్లో కొనుగోలుదారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు అడుగుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి అని వారు అన్నారు. పంట చేతికి వచ్చిన 1520 రోజుల వరకు కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం రైతులకు పెద్ద శాపంగా మారింది.నిల్వ చేసుకునే సదుపాయం లేక, వర్షాలకు పంట తడిసిపోతుందనే భయంతో రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని మొక్కజొన్న కేంద్రాలను మండల కేంద్రాలలో ఏర్పాటు చేసి రైతులు దగ్గర నేరుగా కొనుగోలు చేయాలని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్,అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోలేపొంగు నాగయ్య,పార్టీ డివిజన్ నాయకులు అచ్చా ఉప్పలయ్య, గొర్రెపాటి వీరస్వామి,బ్రహ్మచారి,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,పట్టాభి ,పేరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి

**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కుల రహిత సమాజం కోసం అహర్నిశలు కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం నందికొట్కూరు శాసనసభ్యులు ఎమ్మెల్యే గిత్త జయసూర్య నందికొట్కూరు పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో బాబు జగజ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు టిడిపి నాయకులు,టిడిపి మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



## సంఘసంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి పోతంగల్ మండలాలలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కోటగిరి మండల కేంద్రంలోనీ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జగ్జీవన్ రామ్ కోటగిరి యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆ మహానేయుని 119 వ జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు,అధికారులు,ప్రజ లు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..సామాజిక,రాజకీయ ఉద్యమాలను ఏకకాలంలో నడిపించిన మహానీయుడని. దేశం స్వాతంత్రం కోసం పోరాటం చేసిన సమరయోధుడనీ. దేశ ఉప ప్రధానిగా పలు సేవలు అందించారని కొనియాడా రు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కోటగిరి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్,ఉమ్మడి కోటగిరి మండలం మార్కెట్ కమిటీ చైర్మన్ గైక్వాడ్ హనుమంతు,వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్,పిఎసిఎస్ కోటగిరి మాజీ చైర్మన్ కూచి సిద్దు, కోటగిరి మాజీ ఎంపిటిసి కొట్టం మనోహర్,ఎత్తొండ మాజీ సర్పంచ్ ఆనంద్,నాయకులు తేల్ల రవి కుమార్,విఠల్ గౌడ్, ఏముల నవీన్,నజీర్,నాగయ్య సార్,బాబు జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షుడు జెండా దినేష్,కన్నం శ్రీను,సుధాకర్, నితిన్,కార్తీక్,పండు,నాగేష్,అబ్బయ్య,లాలయ్య,కన్నం సాయిలు,దావులయ్య, అశోక్,బాబు జగ్జీవన్ రామ్ అభిమా నులు పాల్గొన్నారు.



## చిన్నారి విధాత్రిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**పెద్దముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ఆదివారం కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిని నారాయణ రెడ్డి మనమరాలు విధాత్రి డోలారోహణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులతో కలిసి తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి,ఆయన సోదరుడు బుయ్యని సత్యనారాయణ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి విధాత్రిని ఆశీర్వదించారు.ఎమ్మెల్యే వెంట పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ప్రజా ప్రతినిధులు,తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,మంబాపూర్ గ్రామ నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## నిత్యజీవంపై ఆశను సూచించే
# పండుగ ఈస్టర్: పాస్టర్ శేఖర్



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** యేసు పునరుత్థానాన్ని స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారని, క్రైస్తవ విశ్వాసం ప్రకారం ఈస్టర్ పండుగ మరణంపై విజయాన్ని మరియు నిత్యజీవంపై ఆశను సూచిస్తుందని ఖానాపూర్ గ్రామ పాస్టర్ శేఖర్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఖానాపూర్ గ్రామ క్రైస్తవుల ఆధ్వర్యంలో గ్రామంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు మరియు ఆరాధనలు నిర్వహించారు. ఈస్టర్ సందర్భంగా ఖానాపూర్ గ్రామ పాస్టర్ శేఖర్ మాట్లాడుతూ..ఈస్టర్‌కు ముందు వచ్చే శుక్రవారాన్ని 'గుడ్ ఫ్రైడే' (యేసు సిలువ వేయబడిన రోజు) అంటారని, యేసు పునరుత్థానమైన రోజును ఈస్టర్ ఆదివారం అంటారన్నారు.ఈస్టర్ అనేది క్రైస్తవులకు అత్యంత ముఖ్యమైన పండుగని,ఇది యేసుక్రీస్తు మరణం తర్వాత మూడవ రోజున తిరిగి బ్రతికిన (పునరుత్థానం) జ్ఞాపకార్థం జరుపుకుంటారన్నారు. యేసుక్రీస్తు సిలువపై మరణించి,సమాధి చేయబడిన తర్వాత,మూడవ రోజున సమాధి నుండి తిరిగి సజీవంగా లేవడాన్నే పునరుత్థానం అంటారని, క్రీస్తు పునరుత్థానమే లేకపోతే క్రైస్తవ విశ్వాసానికి అర్థమే లేదని బైబిల్ గ్రంథం పేర్కొంటుందన్నారు. బైబిల్ ఆధారంగా, యేసు పునరుత్థానం తర్వాత తన శిష్యులకు మరియు వందలాది మందికి సుమారు 12 సార్లు ప్రత్యక్షమయ్యారని, యేసు పునరుత్థానం మరణంపై, పాపంపై మరియు సాతానుపై పొందిన మహా విజయానికి సూచనగా క్రైస్తవులు భావించి యేసు నడిచిన మార్గంలో నడవాలన్నారు.ఖానాపూర్ గ్రామంలోని చర్చిలో ఈస్టర్ పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ విలేకరి కవేలి అశోక్, తొంట ఆనందం,తొంట సంజీవ్, బుర్క మోహన్,బుర్క బాల్రాజ్,ఖానాపూర్ గ్రామ ప్రజలు,యువకులు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# 7న అమ్మవారికి కుంభోత్సవం



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణం కోసం శ్రీ భ్రమరాంబాదేవి వారికి వారికి ఈ నెల 7న ( మంగళవారం రోజున) కుంభోత్సవం జరుగనున్నది.ప్రతీ సంవత్సరం చైత్రమాసంలో అమ్మవారికి సాత్త్వికబలిని సమర్పించేందుకు ఈ ఉత్సవం నిర్వహించబడుతోంది.ఈ ఉత్సవంలో గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి అమ్మవారికి సాత్త్వికబలిగా సమర్పించబడుతాయి.

**ప్రాత:కాలపూజలు**

ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం గం.5.00లకు ప్రాత:కాలపూజల అనంతరం శ్రీ అమ్మవారికి ఆలయ అర్చకులు నవావరణపూజ,త్రిశతి, ఖడ్గమాల, అష్టోత్తర శతనామ కుంకుమపూజలను, జపపారాయణలను నిర్వహిస్తారు. ఆచారాన్ని అనుసరించి ఈ పూజలన్నీ ఎప్పటివలనే ఏకాంతంగానే జరిపించబడుతాయి.

**కొబ్బరికాయలు - గుమ్మడికాయల సమర్పణ**

ఈ పూజాదికాల తరువాత ఉదయం గం.7.30లకు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కొబ్బరికాయలు, నిమ్మకాయలు, గుమ్మడికాయలు మొదటి విడత సాత్త్వికబలిగా సమర్పించబడుతాయి.

**కోటమ్మవారి పూజలు**

ఉదయం గం. 9.30లకు హరిహరరాయగోపురద్వారం వద్ద గల మహిషాసురుమర్ధిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేకపూజాదికాలను జరిపించి సాత్త్వికబలిగానే కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతుంది.

**శ్రీ స్వామివారికి అన్నాభిషేకం**

ఈ ఉత్సవాలలో భాగంగానే సాయంకాలం శ్రీ మల్లికార్జున స్వామివారికి ప్రదోషకాలపూజల అనంతరం గం. 5.30లకు అన్నాభిషేకం జరిపించబడుతుంది. అనంతరం శ్రీస్వామివారి ఆలయద్వారాలు మూసివేయబడుతాయి.

**కుంభహారతి**

స్వామివార్ల పూజల అనంతరం అమ్మవారికి ఎదురుగా ప్రదక్షిణ మండపములో అన్నాన్ని కుంభరాశిగా వేయబడుతుంది. అదేవిధంగా సింహ మండపం వద్ద కూడా భక్తులు అమ్మవారికి కుంభరాశిని సమర్పిస్తారు. సాయంత్రం గం. 6.15ల నుంచి సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీవేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పించడంతో ఉత్సవంలోని ప్రధానఘట్టం ప్రారంభమవుతుంది.ఈ కుంభహారతి సమయములోనే అధిక పరిమాణంలో పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించబడుతాయి.ఈ పసుపు,కుంకుమల సమర్పణకే “శాంతి ప్రక్రియ” అని పేరు.ఈ సందర్భముగా కూడా రెండవ విడత సాత్త్వికబలిగా అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడుతాయి.కుంభహారతి సమర్పణ తరువాత రాత్రి గం. 7.00ల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుంది.

**మహానివేదన**

ఈ ఉత్సవం సందర్భంగా అమ్మవారికి పలురకాల వంటకాలతో మహానివేదనగా సమర్పించబడుతుంది.

**జంతుబలి నిషేధం**

దేవదాయ చట్టముననుసరించి క్షేత్ర పరిధిలో జంతు మరియు పక్షి బలులు పూర్తిగా నిషేధించబడ్డాయి. కాబట్టి జంతుబలుల నిషేధం కట్టుదిట్టంగా అమలు చేయబడుతోంది.ఈ చట్టం ప్రకారం జంతుబలులు నిర్వహించడమే కాకుండా జంతుబలులకు ప్రత్యక్షంగా కానీ మరియు పరోక్షంగా కానీ సహకరించడం కూడా నేరంగా పరిగణించడం జరుగుతుంది.జంతు/పక్షి బలి నిషేధాన్ని గురించి భక్తులలో అవగాహన కల్పించేందుకు ఇప్పటికే ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా (మైకుద్వారా) జంతుబలి నిషేధాన్ని గురించి విస్తృత ప్రచారం చేయడం జరుగుతోంది. క్షేత్రపరిధిలో జంతుబలి నిషేధం గురించి అవగాహక కల్పించేందుకు పలుచోట్ల బోర్డులు కూడా ఏర్పాటు చేయబడ్డాయి.

**సిబ్బందికి ప్రత్యేక విధులు**

జంతు/పక్షి బలుల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు దేవస్థాన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. ఆలయమాడవీధులు, అంకాళమ్మ ఆలయం,బయలు వీరభద్రస్వామి ఆలయం, క్షేత్రపరిధిలోని మహిషాసురమర్ధిని అమ్మవారు, సుంకులమ్మ అమ్మవారు, అమ్మవారి విగ్రహాలు నెలకొల్పబడిన ప్రదేశాలు మొదలైనచోట్ల సిబ్బంది ప్రత్యేక విధులను నిర్వహిస్తారు.స్థానిక రెవిన్యూ మరియు పోలీస్‌శాఖల సహకారముతో జంతు/పక్షి బలుల నిషేధానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోబడ్డాయి.అదే విధంగా ఉత్సవ నిర్వహణకు కూడా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి.

**కుంభోత్సవం రోజున కల్యాణోత్సవం నిలుపుదల**

ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఎప్పటి వలనే కుంభోత్సవం రోజున శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం, ఏకాంత సేవ నిలుపుదల చేయబడ్డాయి. అదేవిధంగా కుంభోత్సవం రోజున అమ్మవారి ఆలయంలోని అన్ని ఆర్జితసేవలు కూడా నిలుపుదల చేయబడుతాయి.



## ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**- నివాళులు అర్పించిన సర్పంచ్ ప్రియాంక,రాజేందర్**

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ 118,వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ మాట్లాడుతూ..బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహానేత అని కొనియాడారు. సమానత్వం, కులరహిత సమాజం కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయి కుమార్,వార్డు సభ్యులు మ్యాతరి నర్సింలు,దళిత యువత సభ్యులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి బాబు జగజీవన్ రావ్

**- వైసీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్**



**నందికొట్కూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారతదేశ తొలి దళిత ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రావు జయంతిని ఆదివారం నందికొట్కూర్ పట్టణంలోని ఏబియం పాలెంలో ఎస్సీ సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు మార్కెట్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి టౌన్ ప్రెసిడెంట్ మన్సూర్ మాట్లాడుతూ..బాబు జగ్జీవన్ జీవితం గురించీ,ఆయన తన జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకుల అవమానాలను ఆటంకాలను ఎదుర్కొన్న మహోన్నత వ్యక్తి అని అన్నారు. భారతదేశ గౌరవించదగ్గ ముద్దుబిడ్డ బాబు జగ్జీవన్ రావ్ అని ఆయన సేవలను కొనియాడారు.బాబు జగ్జీవన్ రావు జీవితం యావత్ భారత దేశంలోని యువతి యువకులు ఆదర్శప్రాయం తీసుకొని రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ విజ్జి,కేశవ,కౌన్సిలర్ కృష్ణ,యూత్ అధ్యక్షులు లడ్డూ,పట్టణ అధ్యక్షులు చరణ్ తేజ,పాన్యం నాగరాజు,రవి,జగన్,బాబు రఫీ, శంకర్,మహబూబ్,సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com